# ఎడారి పువ్వు

"మీరు తప్పనిసరిగా ఈసమావేశానికి హాజరు కావాలి, గత సంవత్సరం కూడా ఆహ్వానించాము అప్పుడు రాలేకపోయారు" అన్నాడు వెంకటరావు కవిగారితో.

కవిగారు ఆలోచనలో పడ్డారు తన్ను చూడాలనీ తన ఉపన్యాసం వినాలనీ మూడువందల మైళ్ళలో ఉన్న మిత్రులంత అప్యాయంగా ఆహ్వానిస్తున్నపుడు కాదనలేక పోయాడు "వరేవస్తానండీ'' అన్నాడు ముక్తసరిగా.

వెంకటరావు ఆనందంతో సెలవు పుచ్చుకొన్నాడు, అయన వెళ్ళగానే ఆరే చార్జీల విషయం అడగడం మఱచానే అయినా పంపుతారుగా అను కొన్నాడు కవిగారు.

కవిగారి పేరు ప్రభాకరం, ఆయన పేరు వినని వారంటూ ఆంధ్రదేశం లో లేరేమో, అంత గొప్పపేరెలా వచ్చిందో ఆశ్చర్యమే మరి; పుట్టుదరిద్రుడాయె. ఎప్పుడూ డబ్బుకోసం యమ యాతన పడుతుంటాడు ఎన్నోకథలు వ్రాశాడు. వేలాది రచనలు చేశాడు అంతో యింతో ప్రచారంలో ఉన్న అన్ని పత్రికలూ ఆయన రచనలను అనర్గళంగా ప్రచురించాయి. ఏ ఒకరిద్దరో తప్ప నాలుగు రూపాయలు పంపిన పాపాన పోలేదు,

ప్రభాకరానికి నలుగురు పిల్లలు తల్లీ తండ్రి బోలెడంత సంసారం ఈ కుటుంబాన్నంతా ఏవో నాలుగు ట్యూషన్లు చెప్పడంతో వచ్చే డబ్బుతో పోషిం

చడం బ్రహ్మ ప్రయత్నంగా ఉంది. దీనికి తగ్గట్టు తనపరిసరాలన్నీ అదో విచిత్ర ప్రకృతికి ఆలవాల మైనవి. అక్కడా ధనికులు కుబేరులను తలదన్నే కోటీశ్వరు లున్నారు. కానీ వారికి కళాభిమానంలేదు, సాహిత్యమంటే అసలు గిట్టదు. ఆ ఎడారిలో ఈ పువ్వు పూసింది। ఏం లాభం?

తనుండేదొక పూరిపాక, ఆపాకకు అద్దెనెల పెడితే పదిరూపాయలు.

కాఫీ రుచియెరుగడు ప్రభాకరం యింట్లో. ఇంటిల్లి పాదికీ కాఫీ నిషేధం, ఉదయం చద్దినీళ్ళు మధ్యాహ్నం సంగటి. రాత్రికి నాల్గు మెతుకులు.

ప్రభాకరం భార్య సాక్షాత్తు భూదేవి, అంత ఓపిక గల యిల్లాలు కన్పించ డమే అరుదు, ముందు పిల్లలకు వడ్డించి ఆ వెనుక అత్తా మామలకు పెట్టి మిగి లింది, ప్రభాకరానికి వడ్డించి తాను గుక్కెడు నీళ్ళతో ఉసూరుమని పడుకొన్న రోజులు కోకొల్లలు.

వెంకటరావు వెళ్ళిన నాలుగో రోజే మని అర్డరు వచ్చింది, పదేను రూపా యలు వచ్చాయి, ఆ ఊరికి వెళ్ళడానికి బొటా బొటిగా రైలుచార్జి సరిపోతుంది.

ఆ డబ్బువచ్చిన ముహూర్తమెలాంటిదో తెలియదు గాని ఆసమయానికి అక్కడే డబ్బుకోసం పేచీ పెడుతుండిన ఋణదాత అదికాస్తాలాక్కుపోయాడు,

సమావేశం ముందునాటి కంతా ఆడబ్బు సర్దుకోవచ్చునను కొన్నాడు ప్రభాకరం కానీ కథ అడ్డం తిరిగింది, పైగా బోలెడు సమస్యలు,

చిన్నముసురుపట్టిన మూలాన తనకున్నజత బట్టలూచాకలి తేలేదు; వేసు కొన్న లాల్చా మాసిపోయిందైనా ఉతుక్కోవచ్చు కానీ చినిగి పోయింది,

బట్టలు లేవు క్షవరంకూడా లేదు; బండివేళ కావస్తోంది; వస్తానని మాట యిచ్చాడు; డబ్బుకూడా తీసుకొన్నాడు; ఏం చెయ్యాలి?

# 7

ప్రభాకరాన్ని ప్రేమించేవారు లేక పోలేదు. ఎక్కువమంది విద్యార్థులు అయినా ఒక్కసారిగా పదేను రూపాయలు వారు తెచ్చి యివ్వగలరా? నిలిచి పోదా మనుకొంటుంటే ఒక టెలిగ్రాం వచ్చి పడింది; వెంటనే బయలుదేరమని వెంకట రావు యిచ్చాడు.

ప్రభాకరానికి మతిపోయినంత పనైంది. చివరికి సాహసించి యింట్లో ఉన్న ఒకేఒక బిందెను తీసుకెళ్ళి తాకట్టుపెట్టి పదిరూపాయలు తెచ్చి యిచ్చింది భార్య. ఆపదిరూపాయలతో స్టేషనుకు పోతూ పోతూ రెండురూపాయలు ట్యూషన్ డబ్బుతీసుకొన్నాడు ప్రభాకరం.

సరిగ్గా పదకొండుమ్ముప్పావు యిచ్చి టిక్కెట్టుకొని బండిలో కూచున్నాడు.

చాలధైర్యం వచ్చింది ప్రభాకరానికి. దారిలో ఆ చినిగిన జుబ్బానే స్టేషన్లో ఉతుక్కున్నాడు; ఆ రోజంతా ఉపవాసంతో వెళ్ళినా సంతోషంతోనే గడిచింది ప్రభాకరానికి. పావలాలో రెండణాలకు రెండు యిడ్లీలు పోగా మిగిలిన బేడతో గడ్డం గీయించుకొని సమావేశ మందిరం చేరుకొన్నాడు ప్రభాకరం.

సరిగ్గా సాయంకాలం ఐదుగంటలకు సభకు ఆయన రావడంతో అక్కడున్న వారందరూ పరమానంద భరితులయ్యారు. ఆయన నిరాడంబరమైన వేషాన్ని చూచి ఆశ్చర్య పడ్డారు. గొప్పవారెప్పుడూ నిరాడంబరంగా ఉంటారని వారిలో వారు గుసగుసలు పోయారు.

కవిగారిని ప్రశంసిస్తూ పంచరత్నాలు చదివి నిలువెత్తు పూలదండ వేసిన వెనుక ప్రభాకరం గారి మహోపన్యాసం జరిగింది.

అందరూ ఆనంద రసవాహినిలో కొట్టుకపోయారు; చాలమంది విద్యార్థులు కవిగారి సంతకాలకోసం యెగబడ్డారు.

8

కార్యక్రమం ముగిశాక కవిగారికి చాలమందివి పరిచయం చేశారు, ఈ సందడి ముగియడానికి రాత్రి పదకొండు దాటింది, ప్రభాకరం చాల ఆకలితో శోషిల్లిపోయే తరుణంలో భోజనానికి లేచారు.

ప్రభాకరం విస్తరిలో పంచ భక్ష్యపరమాన్నాలు పడ్డించారు కానీ ఆయనకు ఇల్లూ పిల్లలూ తల్లీ తండ్రీ గుర్తుకు వచ్చారు, ఆరాత్రి బియ్యానికి తాను దమ్మిడీనైనా మిగల్చకుండా వచ్చేశాడు; ఎందుకో రుచించక సతమత మవుతుంటే,

"కవిగారికి మా వంట కాలు రుచిస్తాయండీ" అంటూ ఒక మిత్రుడు యెత్తిపొడిచాడు.

ఏవో నాల్గు మెతుకులు తిని పడుకొన్నాడు ప్రభాకరం

ఉదయమే ప్రయాణం ఈ మారు వెంకటరావుగారే సరాసరి స్టేషనుకు వచ్చి టిక్కెట్టు కొనియిచ్చాడు

దారిబత్తెం మాట అడగడం సభ్యత కాదనుకొన్నాడు ప్రభాకరం; దారి ఖర్చుకివ్వడం మర్యాద కాదను కొన్నాడు వెంకటరావు.

ప్రభాకరానికి మిగిలింది ప్రేము కట్టించి యిచ్చిన పంచరత్నాల చట్టం ఆ రత్నాలు కాని రత్నాలిస్తే గుక్కెడు కాఫీ నైనా లభిస్తుందా? అందుకే కవిగారు చెవులుమూసుకొని మూడువందల మైళ్లూ ప్రయాణంచేసి ప్రాణాలతో యిల్లుచేరు కొన్నాడు; ఇంట్లో ఏ మున్నది పొయ్యిలో పిల్లి పడుకొన్నది.